www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 18 జూన్ 2023
5
తిరుపతి



26న వాచీల ఈ-వేలం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను ఈ నెల 26న రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ- వేలం వేయనున్నట్లు టిటిడి పిఆర్‌వో డాక్టరు టి.రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో టైటాన్, క్యాషియో, టైమెక్స్, ఆల్విన్, సొనాట, టైమ్‌వెల్, ఫాస్ట్‌ట్రాక్ కంపెనీల వాచీలున్నాయి. కొత్తవి/ ఉపయోగించిన/ పాక్షికంగా దెబ్బతిన్న వాచీలు మొత్తం 26 (1135 నంబర్లు) లాట్లు ఈ-వేలంలో ఉంచారు. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో కార్యాలయం వేళల్లో, టీటీడీ వెబ్‌సైట్, రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ ను సంప్రదించాలని కోరారు.

'ఆణిముత్యాలు'కు అరుదైన సత్కారం..!

'కార్పొరేట్' విద్య కన్నా...ప్రభుత్వ పాఠశాలలే మిన్న..!

'జగనన్న ఆణిముత్యాలు'లో ఎన్.రాంకుమార్

విద్యారంగంలో సంస్కరణల వల్లే మంచి ఫలితాలు : కలెక్టర్



ప్రజాశక్తి - క్యాంపస్

'కార్పొరేట్ విద్య కన్నా ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులే మంచి ఫలితాలతో పాస్ అవుతున్నారు' అని బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ ఆఫ్ ఎపి ఛైర్మన్ ఎన్.రాంకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో జిల్లాస్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎన్.రాంకుమార్‌రెడ్డి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఇంటర్, పదో తరగతిలో ప్రతిభ కనబరచిన మొదటి మూడు ర్యాంకులు సాధించిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఎన్.రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చదువే ఆస్తిగా నమ్మి విద్యారంగంలో అనేక పథకాలను అమలు చేసి కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని అన్నారు. ప్రతిభలో తగ్గేదేలే అనేలా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ 941 మంది విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలు అందుకోవడం సంతోషదాయకమని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యా రంగంలో సంస్కరణలు అమ లుతో రెండేళ్లుగా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. నాడు-నేడు అమలు చేసి పది రకాల సౌకర్యాల కల్పన, మరుగుదొడ్లు నిర్మించి నీటి సౌకర్యం ఏర్పాటు చేశారన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రమూ ఇన్ని విద్యాసంస్కరణలను అమలు చేయలేదన్నారు. జగనన్న ఆణి ముత్యాలు అందుకుంటున్న విద్యార్థుల తల్లితండ్రులను చూస్తే వారి కళ్ళలో తమ పిల్లల భవిష్యతును చూస్తున్న ఆనందం వారిలో కనిపిస్తోందనానరు. నగర పాలక మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి నవరత్నాలకు ప్రాధాన్యతనిస్తూ పేద, మధ్య తరగతి పిల్లల విద్యకు, ఉన్నత విద్యకు ప్రత్యేక స్థానం కల్పిస్తూ అమ్మఒడి, విద్యకానుక, విద్య దీవెన, వసతి దీవెన, ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ క్లాసు రూమ్ వంటివి ఏర్పాటు చేసి విద్యలో అనేక మార్పులు తీసుకువచ్చారని, నేడు జగనన్న ఆణి ముత్యాల పేరుతో ప్రతి పాఠశాలలో ఎస్ఎస్సి, ఇంటర్ పరీక్షలలో ప్రతిభ కనబరించిన మొదటి ముగ్గురని ఎంపిక చేసి వారి తల్లితండ్రులను, విద్య బోధన చేపట్టిన గురువులను కలిపి ఒకే వేదిక పై సన్మానించడం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం ఎస్.ఎస్.సి, ఇంటర్ పరిక్షలలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన 52 మంది విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండవ బహుమతిగా రూ. 30 వేలు, మూడవ బహుమతిగా రూ.15 వేలు నగదు, ప్రశంసా పత్రం, మెడల్‌ను తల్లితండ్రుల, గురువుల సమక్షంలో విద్యార్థులకు అందించి, ఘనంగా సన్మానించి, ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యా శాఖ అధికారి వి.శేఖర్ స్వాగతోపన్యాసం ఇచ్చారు.



చెరువులు నింపి పొలాలకు నీళ్లివ్వండి


యువనేత నారా లోకేష్‌ను కలిసిన తెగచర్ల గ్రామస్థులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'మా గ్రామంలోని పొలాలు వర్షాధారంపై ఆధారపడి పంటలు పండిస్తామని, తీవ్ర అనావృష్టి పరిస్థితుల్లో వలసలు పోతున్నారని, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ పూర్తి చేసి నీరు ఇవ్వాలని వెంకటగిరి నియోజకవర్గం తెగచర్ల గ్రామస్తులు కోరారు. కెనాల్‌ను పూర్తి చేసి లిఫ్ట్ ద్వారా తమ పంచాయతీలోని చెరువులకు నీరందిస్తే తమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. 130వ రోజు పాదయాత్ర తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలో ప్రవేశించింది. ఎస్సీ కాలనీలోని ఎంపిపిఎస్ పాఠశాలను పక్కనున్న పాఠశాలలో విలీనం చేయడం వల్ల డ్రాపౌట్లు పెరిగి విద్యకు దూరమవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. భూమిలేని పేదలకు భూమి కొనుగోలు పథకం కింద భూమి ఇవ్వాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. నారా లోకేష్ స్పందిస్తూ సీమ ప్రజలకు తాగు, సాగునీరు అందించని రాయలసీమ ద్రోహి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. జగన్ నిర్వాకం వల్ల నాలుగేళ్లుగా లక్షలాది మంది ప్రజలు పొట్ట చేతబట్టుకుని పొరుగు రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మిషన్ రాయలసీమను అమలు చేసి సీమ ప్రజల కష్టాలను తీరుస్తామన్నారు. సోమశిల-స్వర్ణముఖి లింక్‌కెనాల్ పూర్తి చేసి, సమీప గ్రామాల ప్రజలకు నీరందిస్తామన్నారు. గరిమెనపెంట ఎస్టీ కాలనీ, న్యూరామకూరు, గొనుపల్లి, పెనుబర్తిలో స్థానికులతో సమావేశమయ్యారు. పెనుబర్తి శివారు విడిది కేంద్రంలో రాత్రికి బస చేశారు.

గాంధీజీ దండి మార్చ్ విగ్రహాలు ఏర్పాటు చేయండి : కమిషనర్

తిరుపతి టౌన్ : తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూడళ్లలో సుందరీకరణ పనులు చేపట్టాలని, ముత్యాలరెడ్డి పల్లె కూడలిలో మహాత్మాగాంధీజీ దండి యాత్ర ప్రతిబింబించేలా విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రతి ఒక్క కూడలి సుందరంగా వుండేలా తీర్చిదిద్దాలన్నారు. భాలాజీకాలనీ పూలే సర్కిల్ వద్ద ఇటీవల వేస్ట్ వస్తువులతో ఏర్పాటు చేసిన నెమలి విగ్రహం ప్రజలను ఆకట్టుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈలు దేవిక, గోమతి, రవీంద్రరెడ్డి, సంజీవ్ కుమార్, మహేష్ పాల్గొన్నారు.



'ఉరుగ్వే'లో పార్లమెంటరీ కమిటీ

తిరుపతి టౌన్ : వారం రోజుల క్రితం వివిధ అంశాలపై అధ్యయనానికి 10 మంది బందంతో బ్రెజిల్ వెళ్లిన పార్లమెంటరీ కమిటీ అట్నుంచి అటు ఉరుగ్వే చేరుకుంది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వ్యాపార సంబంధాలు పెంపొందించే దిశగా చర్చలు సాగాయని తెలిపారు. ఆ దేశ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, స్పీకర్ చర్చల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ ఏడాది నవంబర్‌లో ఉరుగ్వే పార్లమెంట్ ప్రతినిధులు భారత్‌లో పర్యటించేందుకు సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. భారతదేశంలో పెరుగుతున్న ఫర్నిచర్ ఇండస్ట్రీ డిమాండ్‌కు అనుగుణంగా కొయ్య ఎగుమతి చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. అక్కడి క్రైం రేటు చాలా తక్కువగా ఉందని, అక్షరాస్యత 97శాతంగా ఉందని తిరుపతి ఎంపి గురుమూర్తి పేర్కొన్నారు.

27 నుంచి యువజన సమైక్య సాంస్కృతిక సమ్మేళనం

వరదయ్యపాలెం : ఈనెల 27 నుంచి 30 తేదీల్లో గుంటూరు మహానగరంలో అఖిల భారత యువజన సమైక్య రాష్ట్ర స్థాయి య ఉవజన విద్య వైజ్ఞానిక సాంస్కృతిక తరగతులు జరగనున్నాయని ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు కె.తరుణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వరదయ్యపాలెం బస్టాండ్ ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించి తరగతులను జయప్రదం చేయాలని కోరారు.

ప్రజలకు భారంగా విద్యుత్ ఛార్జీలు : సిపిఐ

తిరుపతి సిటి : ప్రజలకు భారంగా మారిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు, కష్టమర్ ఛార్జీల పేరుతో జగన్ ప్రభుత్వం దోచుకుంటోందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే 200 యూనిట్లు ఉచితంగా ఇస్తానని ప్రకటించి, ఇప్పటికి 11సార్లు ఛార్జీలు పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్, కె.రాధాక్రిష్ణ, నదియా, ఎన్‌డి రవి, ఎన్.శివ, కెవై రాజా, రామకృష్ణ, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ ఆలయాల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ : జెఈవో

ప్రజాశక్తి-తిరుపతి సిటి



టీటీడీ ఆధ్వర్యంలోని తిరుపతి పరిసరాల్లోని స్థానికాలయాలు, బయటి ప్రాంతాల్లోని ఆలయాల్లో దాతల సహకారంతో అన్నప్రసాద వితరణకు చర్యలు చేపట్టాలని జెఈవో వీరబ్రహ్మం అధికారులను కోరారు. ఆయా ఆలయాల అధికారులతో శనివారం జెఈవో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఈవో మాట్లాడుతూ చంద్రగిరి, తొండవాడ, ఒంటిమిట్ట, మంగళంపేట, బూరగమంద తదితర ప్రాంతాల్లోని టీటీడీ ఆలయాల్లో దాతల సహకారంతో ఇదివరకే భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారని, ఇదే తరహాలో మిగతా టీటీడీ ఆలయాల్లో ఏర్పాట్లు చేయాలని చెప్పారు. బయట ప్రాంతాలకు వెళ్లే యాత్రికులకు ఆయా ప్రాంతాల్లోని టీటీడీ ఆలయాల గురించి తెలిసేలా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. యాత్రికులు సంచరించే రైల్వే స్టేషన్, బస్టాండు ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో సమాచారాన్ని ఏర్పాటు చేయడం ద్వారా యాత్రికులు సులభంగా ఆలయాలకు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారని చెప్పారు. ఈ సూచికబోర్డులు పర్యాటక శాఖ ద్వారా, ముఖ్యమైన కూడళ్లలో ఏర్పాటు చేయాలని, టీటీడీ వెబ్‌సైట్, ఎస్వీబీసీ ద్వారా విస్తతంగా ప్రచారం చేయాలని కోరారు. ఇటీవల జమ్మూలోనూ, అదేవిధంగా నారాయణవనం ఆలయాల వద్ద ప్రధాన రహదారుల్లో ఏర్పాటుచేసిన ఆకర్షణీయమైన సూచికబోర్డుల తరహాలో ఇతర ప్రాంతాల్లోని టీటీడీ ఆలయాలకు వెళ్లే మార్గాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఆయా ఆలయాల్లో కల్యాణోత్సవంతో పాటు ఇతర ఆర్జితసేవలు ప్రారంభించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని జెఈవో సూచించారు. ఆలయాల్లో పచ్చదనం-పరిశుభ్రతలో భాగంగా చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కోసం మొక్కలు పెంచాలని డిఎఫ్‌వోను ఆదేశించారు. ఆలయాల్లో ఉభయదారుల సంఖ్యను మరింత పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఆలయంలో శ్రీవారిసేవకులు, భక్తుల ద్వారా అభిప్రాయ సేకరణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో డెప్యూటీ ఈవోలు గోవిందరాజన్, గుణభూషణ్‌రెడ్డి, విజయకుమార్, వరలక్ష్మి, శాంతి, నటేష్ బాబు, దేవేంద్ర బాబు, ఏఈవో కష్ణారావు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని నిర్మూలించాలి : డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి-తిరుపతి సిటి



26 నుంచి కుష్టువ్యాధి నిర్ధారణ అవగాహన కార్యక్రమాన్ని వివరిస్తూ ...

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం కింద జిల్లాలో ఈ నెల 26 జూన్ నుండి 16 జూలై వరకు చేపడుతున్న కుష్టు వ్యాధి నిర్ధారణ అవగాహన కార్యక్రమాన్ని బాధ్యతగా చేపట్టాలని డిఎంహెచ్ఓ డాక్టరు యు.శ్రీహరి, జిల్లా టిబి, ఎయిడ్స్, లెప్రసి అధికారి డాక్టరు అరుణ సులోచనా దేవి సంబంధిత వైద్య అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం కుష్టు వ్యాధి నిర్మూలన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కే.వెంకట రమణ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుష్టు వ్యాధి గుర్తింపు కొరకు ఇంటింటి సర్వే కార్యక్రమం ఈనెల 26 నుండి జూలై 16 వరకు వైద్య శాఖ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గహ సందర్శన చేసి కుష్టు వ్యాధి లక్షణాల పై, స్వీయ పరీక్ష చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి, స్క్రీనింగ్ నిర్వహణ చేపట్టుటకు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ వ్యాధి అంటువ్యాధి కాదని కొన్ని లక్షణాలను గుర్తించిన మేరకు ఈ వ్యాధి నిర్ధారణ చేయవచ్చని, శరీరంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, పొడలు, లావుగా మారిన నొప్పితో కూడిన నరములు, కాళ్లు, చేతుల కండరాలలో బలహీనత, చేతులు, పాదాలు, నరములలో తిమ్మిర్లు అనిపించడం, నొప్పిగా అనిపించని పుండ్లు చేతులలో పాదాలలో ఉండడం, కళ్ళు పూర్తిగా మూసుకోలేకపోవడం, చెవి తమ్మెలు మందంగా మారడం, చర్మంపై, చెవి తమ్మెళ్లపై బుడిపెలు ఉండడం లాంటి లక్షణాలు ఏమైనా ఉంటే వెంటనే పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్షల నిర్వహణ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా చేసి, ఎండిటి మందులు అందిస్తామన్నారు. కనీసం 6 నెలల నుండి గరిష్టంగా 12 నెలల చికిత్స తీసుకుంటే ఈ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని అన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు కావలసింది వైద్యం ఒకటే కాదనీ, మనోధైర్యం కావాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ సుధారాణి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిని శాంత కుమారి, డిసిహెచ్ఎస్ మణి, మెటర్నిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థ సారథి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు అరికట్టాలి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి సిటి

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఎక్కడైనా మాతాశిశు మరణాలు జరగకుండా చూడాలని, ఒక వేళ జరిగితే అందుకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వెంకటరమణా రెడ్డి హెచ్చరించారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు కలెక్టర్ కార్యాలయంలో మాతాశిశు మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీ హరి, మాతాశిశు మరణాలపై సంబంధిత కుటుంబ సభ్యులు, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యుల సమక్షంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ చిన్న పాటి పొరపాటుకు తావులేకుండా ప్రసవ సమయంలో నియమావళి మేరకు వైద్యపరీక్షలు జరిపి తల్లి, బిడ్డల క్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులల్లో జరిగే మాత మరణాలపై సంబంధిత బంధువులు వివరణలను పరిగణలోకి తీసుకుంటామని, నిర్లక్ష్యం వహించిన వారిపై తప్పనిసరి చర్యలు ఉంటాయని అన్నారు. జిల్లాలో గత ఫిబ్రవరి నుండి ఏప్రిల్ వరకు ఒక మాత మరణం, ఆరు శిశుమరణాలు చోటు చేసుకున్నాయని, ప్రభుత్వ లక్ష్యం జీరో మరణాలని గుర్తించి పనిచేయాలని అన్నారు. ఈ సమీక్షలో డాక్టరు అరుణ సులోచన, డిసిహెచ్ఎస్ మణి, డిఐఓ శాంతకుమారి, అనస్థీషియా నుండి డాక్టర్ రాధ, ఎమ్డీఆర్ నోడల్ అధికారి భువనేశ్వరి, బ్లడ్ బ్యాంకు అధికారి ప్రసన్న ఠాగూర్, చిన్న పిల్లల వైద్యులు రాజశేఖర్, డిపిఎంఓ శ్రీనివాసరావు, డిప్యూటి డిఎంహెచ్ఓలు సుధారాణి, హనుమంతరావు, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థ సారధి పాల్గొన్నారు

శిల్ప కళాశాలను సందర్శించిన దేవాదాయశాఖ మంత్రి

ప్రజాశక్తి-తిరుపతి సిటి



టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర శిల్ప కళాశాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డితో కలిసి శనివారం సందర్శించారు. కళాశాల ప్రదర్శనశాలలో ఆలయ నిర్మాణం, శిల, సుధా, దారు, లోహ శిల్పాలు, సంప్రదాయ చిత్రలేఖనం, కలంకారీ పెయింటింగ్ విభాగాలను మంత్రి పరిశీలించారు. తెలుగురాష్ట్రాల్లో ఇలాంటి కళాశాల ఇంకెక్కడా లేదని ఈవో మంత్రికి తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు ఉచిత విద్య, భోజనం, హాస్టల్ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు లక్ష రూపాయలు వారి పేరు మీద బ్యాంక్‌లో డిపాజిట్ చేసి, కోర్సు పూర్తి అయిన తర్వాత వడ్డీతో సహా వారికి అందిస్తున్నట్లు ఈవో వివరించారు. కోర్సు పూర్తి అయ్యాక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎలా ఉన్నాయని మంత్రి ఆరా తీశారు. సనాతన శిల్ప శాస్త్రాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు టీటీడీ చేస్తున్న కషిని మంత్రి అభినందించారు. అనంతరం రాతి విగ్రహాలు తయారుచేసే విభాగాన్ని పరిశీలించి, విగ్రహాల తయారీకి రాతిని సమకూర్చుకునే పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఈ నాగేశ్వరరావు, టీటీడీ సాంకేతిక సలహాదారు రామచంద్రా రెడ్డి, దేవాదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప, కళాశాల ప్రిన్సిపల్ వెంకట రెడ్డి పాల్గొన్నారు.

ఐజర్ నూతన డైరెక్టర్ భట్టాచార్యకు అభినందనలు

ప్రజాశక్తి - క్యాంపస్



తిరుపతిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐజర్)నూతన డైరెక్టర్ గా నియమితులైన ప్రొఫెసర్ సంతాను భట్టాచార్యను ఏబీఆర్ ఎస్ఎం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ తరఫున శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ భట్టాచార్య మాట్లాడుతూ తిరుపతిలో దాదాపు పది విశ్వవిద్యాలయాలు ఉన్నాయని, రాబోయే రోజులలో తిరుపతి ఒక ప్రముఖ పుణ్యక్షేత్రంగానే కాక ఒక గొప్ప విద్యా క్షేత్రంగానూ మారుతుందని, దాదాపు ఒక లక్ష మంది విద్యార్థినీ విద్యార్థులు తిరుపతిలోని వివిధ విద్యాసంస్థలలో విద్యను అభ్యసిస్తున్నారని వెల్లడించారు. ఉన్నత విద్యలో బోధన, పరిశోధన రంగాలలో తిరుపతిలోని వివిధ ఉన్నత విద్యాసంస్థల మధ్య కోఆర్డినేషన్ ఉండాలని అన్నారు. ఒకరి సదుపాయాలు ఇంకొకరు ఉపయోగించుకొని పరిశోధన రంగాలలో నూతన ఆవిష్కరణలు చేపట్టే దానికి ప్రయత్నం చేయాలని దీనికి అనుగుణంగా ఐజర్ తిరుపతిలోని వివిధ ఉన్నత విద్యా సంస్థలతో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై.వి రామి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బుల్లి దాస్, రాష్ట్ర కోశాధికారి ప్రొఫెసర్ రాజశేఖర్, మీడియా ఇన్చార్జ్ డాక్టర్ రంజని, ఏబి ఆర్ ఎస్ ఎం ప్రతినిధులు ప్రొఫెసర్ దామోదరం, డాక్టర్ ఈశ్వర్ రెడ్డి , డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై అలసత్వం వద్దు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



తిరుపతి అర్బన్ నివాసితులకు కేటాయించిన జగనన్న ఇంటి నిర్మాణాలపై అలసత్వం వద్దని అధికారులకు, కాంట్రాక్టర్లకు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఐఏఎస్ సూచించారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం మునిసిపల్ ఇంజనీర్లు, హౌసింగ్, రెవెన్యూ, ప్లానింగ్ అధికారులు, లే అవుట్ల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లతో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ ఇప్పటికే అన్ని సమావేశాల్లోను జూలై నెలలో గహ ప్రవేశాలకు జగనన్న ఇళ్ళ నిర్మాణాలను నిర్దేసించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని స్పష్టంగా తెలియజేసిన ఇంత వరకు అనుకున్న మేరకు లక్ష్యలను చేరుకోకపోవడం అధికారుల పర్యవేక్షణ లోపంగాను, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంగాను పరిగణించాల్సి వస్తుందన్నారు. తిరుపతి నగరంలోని అర్హులైన ప్రజలకు చిందేపల్లి, జీపాళెం, కల్లూరు, ఎం.కొత్తపల్లి, సూరప్పకశం, టిసి.అగ్రహారం ప్రాంతాల్లో నిర్మిస్తున్న జగనన్న ఇళ్ళను లే అవుట్ల వారిగా చర్చిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మిస్తున్న జగన్న నిర్మాణాలను వేగవంతం చేయాలని, ప్రతి ఒక్క కాంట్రాక్టర్ జూలై 17 కల్లా తమకిచ్చిన లక్ష్యాల మేరకు ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయవల్సిందేనని కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకొని లే అవుట్లపై నిరంతరం పర్యవేక్షణ వుండాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, హౌసింగ్ పి.డి వెంకటేష్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మ, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

30న 'నారాయణ అండ్ కో' సినిమా విడుదల

ప్రజాశక్తి - తిరుపతి సిటి

నేటి పరిస్థితుల్లో చిన్న చిత్రాన్ని పూర్తి చేయాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలు పడాలని, ఈ విషయం నారాయణ అండ్ కో చిత్రంలో చవిచూశామని నారాయణ అండ్ కో చిత్ర బందం తెలిపింది. తిరుపతి లీలామహల్ కూడలిలోని ఓ హోటల్ లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. హిరో సుధాకర్ , హీరోయిన్లు పూజ కిరణ్ , యామిని , హాస్య నటుడు జై కష్ణ , డైరెక్టర్ చిన్న పాపిశెట్టి లు మాట్లాడారు. మంచి కెమెరాతో క్వాలిటీ మిస్ కాకుండా ఫ్యామిలీ మొత్తం నవ్వుకోగలిగే సినిమా ను రూపొందించామన్నారు. ప్రముఖ దర్శకులు శేఖర్ కమ్ముల చేతుల మీదుగా ఈ చిత్ర టీజర్ ను విడుదల చేశామన్నారు. 6 నుంచి 60 సంవత్సరాల వయసు కలిగిన ప్రతి ఒక్కరూ చూసే చిత్రమన్నారు. ప్రేక్షకులంతా చిత్రాన్ని ఆదరించాలని కోరారు. ఈనెల 30వ తేదీ విడుదల కానున్న ఈ చిత్రంలో సీనియర్ నటులు సప్తగిరి , ఆమని , దేవి ప్రసాద్ తదితరులు నటించారన్నారు. ఇదివరకే ఓ సాంగ్ ని రిలీజ్ చేశామని. అది ప్రేక్షకుల ఆదరణ పొందిందన్నారు. ఒక్కో పాటను వేరువేరు మ్యూజిక్ డైరెక్టర్ లతో రూపొందించామన్నారు. ఈ చిత్రంపై తాము ఆశలు పెట్టుకుని ఉన్నామని, తమ చిత్ర టీంను ఆశీర్వదించాలని కోరారు.


మీడియాతో చిత్ర యూనిట్

ఉపాధి పనుల తనిఖీ



ప్రజాశక్తి- తొట్టంబేడు: తొట్టంబేడు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను తిరుపతి జిల్లా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కూలికి రూ.272 వచ్చేలా కొలతలు వేయాలన్నారు. కూలీలకు 100 శాతం పని దినాలు కల్పించాలన్నారు. కూలీల శాతం పెంచాలని.. పని ప్రదేశాల్లో కూలీలకు మజ్జిగ, నీళ్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అనంతరం కూలీలకు ఆయన మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రేమ్ కుమార్, ఏపీవో సుజాత, ఈసీ మునిశేఖర్, టీఏలు మునిబాబు, అరుణ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు దొరవారిసత్రం విద్యార్థులు



ప్రజాశక్తి-దొరవారిసత్రం: పదో తరగతిలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆణిముత్యాలులో దొరవారిసత్రం మండలంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులు, మావిళ్ళపాడు గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం తిరుపతిలో పద్మావతి యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థిని గురులక్ష్మికి మొదటి బహుమతిగా రూ.50 వేలు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డీఈవో శేఖర్ అందించారు. రెండో బహుమతిగా డి.జెషికకు రూ.30 వేలు అందించారు. మూడో బహుమతిగా లక్ష్యాకు రూ.15 వేలు, ఎం.లాలసకు రూ.30 వేలు బహుమతిగా అందించినట్లు కేజీబీవీ ప్రిన్సిపల్ పార్వతి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సుమలత తెలిపారు. విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండు చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో కేబీఆర్ పురం గ్రామంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో మోహన్‌రాజు, ప్రేమానంద్ రాజు, కేశవులు, వెంకటేశులు, సుబ్రహ్మణ్యం రాజు , సెల్వరాజ్ ఆచారి, రవి, భాస్కర్, రమేష్, కృష్ణారెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణ పరిధిలోని ఎన్జీవో కాలనీ, గణపతినగర్ కాలనీల్లో జరుగుతున్న అభివద్ధి పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ, ఏఈలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ తరలింపు.. అడ్డుకున్న జనసేన



ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి-రాపూరు మార్గంలో కైవల్యనది పక్కనే జేసీబీ, 20 ట్రాక్టర్లతో ఇసుక గ్రావెల్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా తోలుతున్నారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వర్లు ట్రాక్టర్లను అడ్డగించి ప్రభుత్వం నుండి గ్రావెల్ తరలించేందుకు అనుమతులు ఉంటే చూపాలని.. పట్టుబట్టడంతో 23 వ వార్డు కౌన్సిలర్‌తో మాటల యుద్ధం జరిగింది. పోలీసులు చేరుకుని జనసేన పార్టీ కార్యకర్తలను అక్కడి నుండి పంపేశారు.

విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రాధాన్యత



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తల్లిదండ్రుల కంటే గొప్పగా విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వడానికి ప్రాధాన్యత ఇస్తున్నారని పుత్తూరు మున్సిపల్ వైస్ ఛైర్మన్ శంకర్ అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల స్థాయిలో పదో తరగతిలో ప్రతిభ చూపిన ముగ్గురికి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శేషగిరి, సీఆర్పీ జగ్గారవు, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నామని ఏవో భారతి తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకాలతో ఆర్‌బీకేల్లో సంప్రదించాలని కోరారు.

దిగజారుడు రాజకీయాలు తగదు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి వినుత భర్త కోటా చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయించడం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని టీడీపీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి విమర్శించారు. జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి వినుత కోటా భర్త చంద్రబాబుపై పోలీసులు కేసు బనాయించి జైలుకు పంపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి సబ్ జైలులో ఉన్న కోటా చంద్రబాబును శనివారం టీడీపీ నేత బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పరామర్శించారు. ఆయనతో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. కోటా చంద్రబాబుకు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సానుభూతి ప్రకటించారు. అదేవిధంగా శ్రీకాళహస్తిలోని వినుత కోటా ఇంటికి వెళ్లి పరామర్శించి ఆమెకు ధైర్యం చెప్పారు. ఇకపై ప్రజా సమస్యలపైన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి చేసే అరాచకాలపైన ఉమ్మడి పోరు చేద్దామని చెప్పారు. ఇందుకు వినుత కోటా కూడా అంగీకరించారు. కాగా సబ్ జైలులో కోటా చంద్రబాబును పరామర్శించిన అనంతరం అక్కడే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తిలో జరిగే సంఘటనలు చూస్తే బాధ కలుగుతోందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బియ్యపు మధుసూదనరెడ్డి కక్ష పూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తనపై కూడా ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టినట్లు ఈ సందదర్భంగా ఆయన గుర్తు చేశారు. చిందేపల్లి దారి కోసం పోరాటం చేసిన జనసేన నేత కోటా చంద్రబాబుపై అక్రమ కేసు బనాయించి అరెస్టు చేయించి జైలుకు పంపడం చాలా దారుణమన్నారు. చంద్రబాబు ఏ తప్పు చేయలేదన్నారు. గాజులమండ్యం సీఐ ఆరోహణరావు ముందస్తు ప్రణాళికతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డితో చేసుకున్న లోపాయికారి ఒప్పందం మేరకు జనసేన నేత చంద్రబాబుపై అక్రమ కేసు బనాయించారని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆరోపించారు. అక్రమ కేసును ఖండిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ అక్రమ కేసులు, అరాచకాలు పోవాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని చెప్పారు. ఎమ్మెల్యేగా బియ్యపు మధు కాల పరిమితి ఇక కేవలం ఎనిమిది నెలలేననీ, తర్వాత తానే ఎమ్మెల్యేనంటూ జోష్యం చెప్పారు. టీడీపీ నేతలు విజయకుమార్, చెంచయ్యనాయుడు, కాసరం రమేష్, వజ్రం కిషోర్, నెమళ్లూరు బుజ్జి ఉన్నారు.

రేపటి నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 19న సోమవారం నుంచి డిగ్రీలో ప్రవేశాలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు కళాశాల కార్యాలయంలోగాని, ఫోన్ నంబర్లు 9985 313431, 7396 650368 , 9182 136020, 8374 556441లను సంప్రదించవచ్చని తెలిపారు.

ఘనంగా రజనీకాంత్ జన్మదిన వేడుకలు




ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేటలోని చేయూత చిన్నపిల్లల అనాథ ఆశ్రమంలో శనివారం సూళ్లూరుపేట నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి కందాటి రజనీకాంత్ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. రాబోవు రోజుల్లో సూళ్లూరుపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం



ప్రజాశక్తి-చిట్టమూరు: ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే చర్యలు తీసుకుంటానని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు అన్నారు. శనివారం కొత్తగుంట సర్కిల్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలు పెట్టేందుకు స్థల సేకరణకు పరిశీలించారు. ఆర్ అండ్ బీ రోడ్ల ఆక్రమణలు వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. తహశీల్దారు విజయలక్ష్మి, ఆర్ఐ మధులత, వీఆర్వో చిరంజీవిలతో స్థల వివరాలపై చర్చించారు. కొత్తగుంట శ్మశాన వాటికను పరిశీలించారు. వైసీపీ నాయకులు సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ బి.వి.వెంకటరమణయ్య, మాజీ ఎన్.డి.సి.సి బ్యాంక్ డైరెక్టర్ మధు యాదవ్, వైసీపీ సీనియర్ నాయకులు దేవరెడ్డి సుధాకర్ రెడ్డి, జంగలపల్లి సుబ్బయ్య, వంక చెంచయ్య, సర్పంచ్ మణి, రెహమాన్, గజేంద్ర రెడ్డి, బంగారయ్య, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈగా అలీ



ప్రజాశక్తి -తొట్టంబేడు: తొట్టంబేడు హౌసింగ్ నూతన ఏఈగా అలీ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాళహస్తి రూరల్ ఏఈగా పనిచేస్తూ సాధారణ బదిలీలో భాగంగా తొట్టంబేడు మండలానికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ సుబ్ర హ్మణ్యం శ్రీకాళహస్తి అర్బన్‌కు బదిలీ అయ్యారు.

విద్యార్థులకు సన్మానం



ప్రజాశక్తి-వరదయ్యపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ సంస్థలకు ధీటుగా మెరుగైన ఫలితాలు సాధించారని దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొప్పన తిలక్ బాబు, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం వరదయ్యపాలెం గోవర్ధనపురం ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ఉన్నత మార్కులతో ప్రతిభ చాటిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముని సుబ్రమణ్యం(వరదయ్యపాలెం), గోపీనాథ్ (గోవర్ధనపురం), వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్, పాఠశాలకమిటీ ఛైర్మన్ మమత, ముద్దుకృష్ణ, ఉపాధ్యాయులు, గుత్తి త్యాగరాజు పాల్గొన్నారు.

అనుబంధాలయాలకు మహా కుంభాభిషేకాలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధాలయాలన్నిటికీ త్వరలోనే మహా కుంభాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన అనుబంధ ఆలయాల్లో జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. చక్రేశ్వర స్వామి, చల్లేశ్వర స్వామి, వీరభద్ర స్వామి, శ్రీకాలభైరవ స్వామి ఆలయాల ఆధునీకరణ పనులను ఇంజనీర్ నూకరత్నంతో కలిసి పరిశీలించిన అనంతరం శ్రీనివాసులు మాట్లాడారు. పురాతన పురాణ చరిత్ర కలిగిన ఈ అనుబంధ ఆలయాలకు మహా కుంభాభిషేకం నిర్వహించాలని సంకల్పించినట్లు చెప్పారు. పురాతన ఆలయాలకు మహర్దశ పట్టే విధంగా జీర్ణోద్ధారణ, ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సహకారంతో చేపట్టామన్నారు. ప్రస్తుతం ఆయా ఆలయాలలో జీర్ణోద్ధారణ, ఆధునికరణ పనులు చివరి దశకు చేరుకున్నాయని. త్వరలో కుంభాభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. .

యోగాతో మానసిక ఒత్తిడి దూరం




ప్రజాశక్తి-క్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, యోగా విభాగం సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా బైరాగిపట్టెడ శిష మందిరంలో శనివారం జరిగిన యోగా చికిత్స శిబిరానికి ముఖ్యఅతిథిగా ఉప కులపతి ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్. కష్ణమూర్తి పాల్గొన్నారు. అందులో భాగంగా అక్కడి స్పెషల్ నీడ్ చిల్డ్రన్స్ యోగా విన్యాసాలతో అందరినీ అలరించారు. కార్యక్రమంలో భాగంగా వైస్ ఛాన్సర్ మాట్లాడుతూ ఈ ప్రపంచానికి మహర్షి పతంజలి అందించిన గొప్ప వరముగా యోగశాస్త్రాన్ని కొనియాడారు. మహర్షి పతాంజలి యోగ విద్య, ఆయుర్వేద వైద్య విద్యను మన భారతీయ సనాతన పద్ధతిలో అందించారని చెప్పారు. అనేక రకాల మానసిక మరియు శారీరక రుగ్మతలను ఎదుర్కోవడానికి యోగా విద్య ఒక సాధనంగా పనిచేస్తుందని అన్నారు. అందుకే ప్రధానమంత్రి యోగా ఆవశ్యకతను ప్రపంచమంతా తెలిసేలా యోగా దినోత్సవాన్ని ప్రారంభించారని.. అందులో భాగంగా కేంద్రియ విద్యా సంస్థ అయిన రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం సామాజిక సేవా దక్పథంలో భాగంగా అనేక రకాలైన సేవా కార్యక్రమాలను యోగవిభాగం ద్వారా సమాజంలో నిర్వహిస్తుందని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను నిర్వహించి, యోగ విద్య అందరూ అభ్యసించి ఆరోగ్యాన్ని సంరక్షించుకొనే విధంగా యోగవిభాగం కృషి చేస్తుందని తెలియజేశారు. యోగా విభాగం అధ్యక్షులు డా.ఆర్.లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేపీఆర్ మైన్స్ దౌర్జన్యాన్ని అరికట్టండి



ప్రజాశక్తి-చిల్లకూరు: చిల్లకూరు మండల పరిధిలోని పునుగుంటపాలెం గ్రామానికి చెందిన కేపీఆర్ మైన్స్ యజమాని దౌర్జన్యం అరికట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో మండల కార్యదర్శి ముత్యాలయ్య, మహేష్ డిమాండ్ చేశారు. కేపీఆర్ మైన్స్ యజమాని పునుగుంట గ్రామస్థులపై కేసులు పెట్టడం అన్యాయన్నారు. సర్వే నంబర్ 451లో గత 70 సంవత్సరాల నుంచి వేరుశనగ పంట పండించుకుంటున్న రైతులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా రైతులపై దౌర్జన్యం చేస్తూ ఆ రైతులపై క్రిమినల్ కేసులు పెడుతూ గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేస్తుండటం ఎంతవరకు సమంజసమని గ్రామస్థులు పేర్కొన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా తమ భూముల్లో ఇసుక తీసుకెళ్తే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. రైతులకు సిపిఎం నాయకులు అండగా ఉంటారని ముత్యాలయ్య తెలిపారు.

బాల కార్మిక చట్టాలు అమలు కావాలి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బాల కార్మిక చట్టాలు సమర్థవంతంగా అమలైతేనే సమాజంలో బాల కార్మిక వ్యవస్థ అంతరించిపోతుందని ప్రముఖ న్యాయవాది గరికపాటి రమేష్ బాబు అన్నారు. బాల కార్మిక నిర్మూలన మాసోత్సవాల్లో భాగంగా జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెల్ ఆధ్వర్యంలో కొత్తపేట లోని రామచంద్ర కూల్ డ్రింక్స్ ప్రాంగణంలో ప్రజలకు బాల కార్మిక నిర్మూలన చట్టంపై అవగాహన కల్పించారు. న్యాయవాది రమేష్ బాబు మాట్లాడుతూ పిల్లలు బడికి, పెద్దలు పనికి అనే నినాదంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. పిల్లలు తప్పక బడికి పంపించాలని, పనిలో పెట్టుకున్న యాజమాన్యాలకు కఠిన శిక్ష ఉంటుందని హెచ్చరించారు. న్యాయ సలహాల కోసం 15100 సంప్రదించాలని సూచించారు.

19న ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-వెంకటగిరి: పట్టణంలోని చేనేత కార్మికులు నివాసం ఉంటున్న వివిధ ప్రాంతాల్లో ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు చింత గింజల చిన ఓబయ్య మాట్లాడుతూ గత కొంతకాలంగా దుకాణాల్లో చీరలు అమ్ముడుపోక పేరుకుపోతున్నాయి. దీంతో మాస్టర్ వీవర్లు కార్మికులకు పని తగినంత ఇవ్వడం లేదు. చేనేతకు రిజర్వ్ చేసిన 11 రకాల డిజైన్లను పవర్ లూమ్ లో తయారు చేయడంతో చేనేత చీరలకు గిరాకీ తగ్గిందన్నారు. పైగా చేనేతకు వాడే పట్టు, నూలు, జరీ,రంగులు, రసాయనాల ధరలు భారీగా పెంచడం, ముడి సరుకులపై, వస్త్రాల అమ్మకాలపై జీఎస్టీ విధించడంతో చీరల ధరలు పెరుగుతున్నాయి. చేనేత జౌళి శాఖ కలిసి ఉన్నందున చేనేతకు ఇవ్వాల్సిన రాయితీలన్నీ మిల్లులు నిర్వహిస్తున్న బడబడా యజమానుల పరమవుతున్నాయి. దీంతో సబ్సిడీలకు నోచుకోని చేనేత బట్ట ఖరీదై చీరలు అమ్ముడుపోక చేనేత రంగం మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సొంత మగ్గాలకే గాక షెడ్డుల్లో నేస్తున్న వారికీ, ఇతర చేనేత ఉపవత్తుల వారందరికీ నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చేనేత వత్తిని పరిరక్షించుకునేందుకు రాష్ట్రస్థాయిలో ఆరు చేనేత కార్మిక సంఘాలు అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించి, విజ్ఞాపన పత్రాలు అందజేయాలని పిలుపునిచ్చాయన్నారు. తిరుపతి కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న నేత కార్మికులు హాజరుకావాలని కోరుతున్నామని తెలిపారు. కార్యదర్శి నీలా సుబ్బరాయులు,నాయకులు నందా వెంకటేశ్వర్లు, దిండివనం భాస్కర్, పట్నం సుబ్రహ్మణ్యం, లోకేష్ పాల్గొన్నారు.

రైలు ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-గూడూరు టౌన్: రైలు ప్రమాదాలు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని. విధుల్లో సిబ్బంది అలసత్వం వహిస్తే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని రైల్వే విజయవాడ డివిజన్ ఆపరేషన్ ఏడీఆర్ఎం శ్రీకాంత్ వెల్లడించారు. శనివారం గూడూరు పట్టణంలోని రైల్వే కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఏడిఆర్ ఎం సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీనియర్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీనాథ్, డివిజనల్ ఇంజినీర్ శ్రీనివాసరావు, స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



ప్రజాశక్తి-తిరువానూరు: తిరుచానూరు పంచాయతీలోని ఓ హోటల్ వెనుక భాగంలో కొందరి నుంచి గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సాయికష్ణారెడ్డి (దామినేడు), నవీన్ అలియాస్ టోనీ(పద్మావతిపురం), హేమంత్ అలియాస్ బిట్టు(పేరూరు), ముని రాజమ్మ అలియాస్ బసమ్మ(పద్మావతీపురం) పవన్ కుమార్ (పేరూరు)ల నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానస్పదంగా యువతి మృతి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి మృతిచెందిన సంఘటన శనివారం తిరుపతిలో జరిగింది. తిరుపతి రూరల్ పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన సౌజన్య, మణిమాల అక్కాచెల్లెళ్లు. ఓ సూపర్ మార్కెట్లో పని చేసుకుంటూ వేశాలమ్మ గుడి వీధిలో నివాసం ఉంటున్నారు. రోజులాగే ఉదయం ఏడుగంటలకు మొదటి షిఫ్ట్ డ్యూటీ నిమిత్తం ఇంటి నుంచి వెళ్లింది. తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో మణిమాల ఫోన్ నుంచి అక్క సౌజన్యకు పోలీసులు ఫోన్ చేసి మీ చెల్లెలు ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. రోడ్డు పక్కన మణిమాల పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని.. అటుగా వెళుతున్న హోంగార్డు సైతం చూశాడని పోలీసులు వెల్లడించారు. 90 శాతం గాయాలపాలైన మణిమాలను స్థానికుల సహాయంతో రుయాకు తరలించారు. రుయాలో చికత్స పొందుతూ బాధితురాలు మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతా అనుమానాస్పదమే

మణిమాల ఆత్మహత్యకు ప్రయత్నించడం, కాలిన గాయాలతో మతిచెందడం అంతా అనుమానస్పదంగానే ఉంది. టౌన్ క్లబ్ వద్ద ఉన్న మణిమాల, పద్మావతి మహిళా యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ఓ సూపర్ మార్కెట్లో పనిచేస్తుంది. డ్యూటీ నిమిత్తం వెళ్లిన అమె తిరపతి రూరల్ 150 బైపాస్ రోడ్‌లోని వకుళమాత ఆలయం సమీపంలో పాతకాల్వ వద్దకు ఎందుకు వెళ్లింది. సంతోషంగా తిరుగాడుతున్న ఆమె ఉన్నఫలంగా ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలేవి అంతుచిక్కని ప్రశ్నలే. పోలీసుల విచారణలో నిజానిజాలు తేలాల్సి ఉంది.

టిప్పర్ ఢీకొని వ్యక్తి ...



ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట-పుత్తూరు పాత రోడ్డు మార్గంలోని టిప్పర్ ఢీకొని శనివారం రాత్రి ఓ వ్యక్తి మతి చెందాడు. రేణిగుంటకు చెందిన కిరణ్(37) ద్విచక్ర వాహనంలో కె.ఎల్.ఎం హాస్పిటల్ కూడలికి వెళుతూ ఉండగా.. వెనుకనుంచి వచ్చిన టిప్పర్ అతడిని ఢీకొంది. ప్రమాదంలో కిరణ్ అక్కడికక్కడే మతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐఐటీటీఎంలో దరఖాస్తులకు ఆహ్వానం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ (ఐఐటిటిఎం)లో ఎంబిఏ, బిబిఏ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అడ్మిషన్ కమిటీ ఛైర్మన్ సికె.సంజీవరెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో దక్షాణాది రాష్ట్రాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని.. ఎంతో డిమాండ్ ఉన్న కోర్సులు, ఉపాధి అవకాశాలను ఐఐటిటిఎం అందిస్తోందన్నారు. టూరిజం రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన బోధన, ప్రపంచంలో ప్రాచుర్యం కలిగిన భాషలను నేర్పిస్తామన్నారు. 100 శాతం ప్లేస్‌మెంట్ కల్పిస్తామన్నారు. 2023-25 విద్యా సంవత్సరానికి గాను టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో 2 సంవత్సరాల కాల వ్యవధితో ఎంబిఏ కోర్సు, 3 సంవత్సరాల కాల వ్యవధితో బీబీఏ కోర్సులకు ఔత్సాహికులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంబీఏలో దరఖాస్తు చేసుకోవడానికి ఏదేని డిగ్రీ పాసై ఉండాలని, బిబిఏకు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఏపీ విద్యార్థులకు జగనన్న విద్యాదీవెనతో ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉందన్నారు. జూన్ 6 తేది దరఖాస్తులు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9490787854, 9966462786ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అడ్మిషన్ కమిటీ సభ్యులు చాన్‌బాషా పాల్గొన్నారు.

రేపు బహుజన రాజ్యాధికార సభ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈ నెల 19న మదనపల్లిలో రాయలసీమ బహుజన రాజ్యాధికార సభను నిర్వహిస్తున్నట్లు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.గుర్రప్ప తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బహుజనులు ఉత్తరప్రదేశ్ తరహాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. బహుజనులు నేటికి అభివృద్ధిని నోచుకోక ఇబ్బందులు పడుతూనే ఉన్నారన్నారు. అగ్రకులాల్లోని పేదలు దీనస్థితిలో ఉన్నారన్నారు. టిడిపి, జనసేన, వైసిపి ఈ మూడింటిలో దేనికి వేసినా పరోక్షంగా బిజెపికి ఓటు వేసినట్లేనన్నారు. బిఎస్‌పి ఆధ్వర్యంలో 100 సీట్లు బీసీలకు కేటాయిస్తామన్నారు. సభా కార్యక్రమానికి ముందు సాయంత్రం నాలుగు గంటలకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, ప్రభాకర్, వేణుగోపాలరాజు, జయచంద్ర, శశికుమార్, వెంకటేష్, హనుమంతరాజు పాల్గొన్నారు.

మహిళలకు దుస్తుల పంపిణీ



ప్రజాశక్తి- దొరవారిసత్రం: దొరవారిసత్రం మండలం పూలతోటమిట్ట గిరిజన కాలనీలో పీపుల్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు, మహిళలకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. తహశీల్దారు గోపీనాథ్ రెడ్డి, ట్రస్ట్ అధ్యక్షులు పోతుగుంట మల్లికార్జునరావు, సీసీ సీహెచ్ సలోమి, రేషన్ షాప్ డీలర్ సీహెచ్ మణి, మస్తానయ్య, అరుణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

విద్యారంగ
ప్రత్యేక సంచిక

ఎడివిటి ఫీచర్ - తిరుపతి

18.06.2023 ఆదివారం

ప్రభుత్వ పాఠశాలల్లోనూ... ఇక డిజిటల్ పాఠాలు..!



'ప్రజాశక్తి'తో డీఈవో వి.శేఖర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఇక ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలోనూ డిజిటల్ యుగం రానుందని జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్ అన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ విద్యాబోధన డిజిటల్ పాఠాల రూపంలో ఉంటుందన్నారు. 'ప్రజాశక్తి' విద్యా సంచిక తీసుకొస్తున్న నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం లక్ష్యం, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న 'కానుక'లను వివరించారు. జిల్లాలో 34 మండలాల్లో 2,338 ప్రభుత్వ స్కూల్స్ ఉన్నాయని, బాలురు 83,669, బాలికలు 82,995 మంది చదువుతున్నారన్నారు. లక్షా 66వేల 664 మంది ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారని చెప్పారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. 6-10వ తరగతి వరకు ఈ ఏడాది పిల్లల మదిలో గుర్తుండిపోయేలా డిజిటల్ క్లాసులు ఉంటాయన్నారు. పాఠ్యపుస్తకాల్లో పాఠాలన్నీ డిజిటల్‌రూపంలో తీసుకొచ్చి విద్యాబోధన, అత్యాధునిక టెక్నాలజీతో జరపనున్నట్లు చెప్పారు. అలాగే 1-5వ తరగతి వరకు స్మార్ట్ టీవీల ద్వారా క్లాసులు నిర్వహించనున్నాం. దాదాపు అన్ని పాఠశాలలకు పరికరాలు చేరిపోయాయన్నారు. నాడు-నేడు కింద పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న మరమ్మతు పనులన్నీ పూర్తయ్యాయన్నారు. మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రభుత్వ బడులను తీర్చిదిద్దామన్నారు. డిజిటల్, స్మార్ట్ టీవీల్లో పాఠాలు ఎలా బోధించాలనే 2 లో

'చేతిరాత' రారాజు...!





'ప్రజాశక్తి'తో సంగరాజు భాస్కర్‌రాజు

'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు' అన్నాడొక మహాకవి.. గట్టి సంకల్పంతో 'అక్షరాన్ని' నమ్ముకున్నాడు.. 'చేతిరాత'ను అందంగా మలచడంలో శాస్త్రీయ పద్ధతిని అవలంభించాడు. మారుమూల గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో పెరిగారు. విషాదాలు, ఒడిదుడుకులు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడి ఇవేమీ ఆయన సంకల్ప బలం ముందు నిలవలేదు. 'చదవడం రాదు' అనేవారు ఎవ్వరూ ఉండకూడదనే లక్ష్యంతో ఆ దిశగా అహర్నిశలు కృషి చేసి విజయం వైపు అడుగులేస్తూ చదువుపైన రీసెర్చి చేశారు. చదువులు డాక్టర్ అయ్యారు మన సంగరాజు భాస్కర్‌రాజు. తన ఐదో ఏటే తల్లి చనిపోయింది.. కాకతాళీయమే అయినా భాస్కర్‌రాజు పెళ్లయిన నాలుగేళ్లకే మొదటి భార్య మృతిచెందింది. అయినా ఏ లోటూ లేకుండా బిడ్డలను పెంచి పెద్ద చేశారు ఆ తండ్రీ కొడుకులు. న్యూ బాలాజీకాలనీలోని మేక్‌మై బేబీ జీనియస్ స్కూలులో తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన తన అనుభవాలను పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతికి సమీపంలోని వడమాలపేటకు కూతవేటు దూరంలో ఉన్న ఓబులరాజు కండ్రిగ మా ఊరు. ఎస్.వెంకటరమణరాజు, మంగమ్మ నా తల్లిదండ్రులు. నేను రెండో సంతానం. మాది పూర్తిగా వ్యవసాయ ఆధారిత కుటుంబం. నా చిన్న వయస్సులోనే మా అమ్మ మరణించింది. అప్పటినుంచి మా అక్కకు, నాకు నాన్నే అన్నీ. మా మేనత్త సహకారంతో మమ్మల్ని పెంచి పెద్ద చేశారు. ఎస్‌విపురం, తిరుమణ్యం, వడమాలపేట స్కూళ్లల్లో పదో తరగతి వరకు నా చదువు సాగింది. గూడూరు పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా పూర్తి చేశాను. 1991లో ఎస్వీయూలో బిటెక్ చేరి అనివార్య కారణాలతో చదువు ఆపేశాను.

మొదటినుంచి సమాజం నాకేమిచ్చింది అనే దానికన్నా సమాజానికి నేనేమివ్వాలనే ధోరణితోనే ఉండేవాన్ని. వడమాలపేట వద్ద పదో తరగతి ఫెయిలైన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ట్యూషన్ ఏర్పాటు చేశాను. చుట్టుపక్కల గ్రామాల్లోని పిల్లలకు చదువుపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. పదో తరగతి పాస్ అయితే చాలనుకునేవారు. అలాంటిది పదో తరగతి ఫెయిలైన వారికి శిక్షణ ఇచ్చి, సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రథమశ్రేణిలో అందరూ పాస్ అయ్యేలా కృషి చేశాను. ఇది నా తొలి విజయం. ఈ విజయమే విద్యాసంస్థ ప్రారంభానికి తొలి బీజం పడింది. 1992లో వడమాలపేట కేంద్రంగా అశ్వనీ టాలెంట్ స్కూలును స్థాపించాను. 1995లో మంజులతో నా వివాహం అయ్యింది. మాకు యశ్వంత్, అశ్వినీ పిల్లలు. 1999లో నా భార్య మంజుల మృతిచెందింది. మూడేళ్లు కూడా దాటని ఇద్దరు పిల్లల ఆలనా పాలన చూసుకుంటూనే విద్యాసంస్థను కొనసాగించాను.



ఆ సమయంలో ప్రచార మాధ్యమాల ద్వారా ఎన్‌ఎల్‌పి (న్యూరో లింగ్విస్టిక్ ప్రొగ్రామ్) గురించి తెలుసుకుని, ఒంగోలులో నెల్లూరు రాఘవరరాజు వద్ద ఆ కోర్సు పూర్తి చేశాను. అదే సమయంలోనే నాకు హ్యాండ్‌రైటింగ్ ఆలోచన వచ్చింది. రీసెర్చ్ ప్రారంభించాను. నా స్కూల్ విద్యార్థులకు హ్యాండ్‌రైటింగ్‌లో శిక్షణ ఇవ్వడంతో. చదువుకునే 30 మంది పదో తరగతి విద్యార్థులందరూ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించేలా చూశాను. అప్పట్లో ఇది జిల్లాకే గర్వకారణంగా నిలిచింది.

హ్యాండ్‌రైటింగ్‌పై ప్రత్యేక శిక్షణ

పిల్లలు ఎంత చదువుకున్నా, ఎంత నేర్చుకున్నా... చక్కని చేతిరాత లేకపోతే చదివిందంతా బూడిదలో పోసిన పన్నీరే. అందుకే 2000 సంవత్సరంలో తిరుపతి పెద్దకాపు వీధిలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పిల్లలకు హ్యాండ్‌రైటింగ్‌పై శిక్షణ ప్రారంభించాను. 2005లో మైకెలాజిలెవోరీ రచించిన హోల్ బ్రెయిన్ పవర్ అనే పుస్తకాన్ని చదవడం ద్వారా 10 రకాల స్లేట్ ప్యాటర్న్ రూపొందించి నా పిల్లలకే శిక్షణ ఇచ్చాను. అనతికాలంలోనే వారి మేథోశక్తి పెరగడంతో విజయం సాధించాను. నా ప్రయోగాలన్నీ మొదట నా పిల్లలపైనే ప్రయోగించేవాన్ని. అందుకు వారి సహకారం వందశాతం ఉండేది. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి 'హ్యాండ్‌రైటింగ్'పై అవగాహన కల్పించేవాన్ని. పిల్లల ఆలనాపాలన ఇబ్బంది కావడంతో తండ్రి వెంకట రమణరాజు ప్రోద్భలంతో 2009లో వివాహం చేసుకున్నాను. మంజునాథ్ జన్మించాడు. 2009-10లో పదో తరగతి విద్యార్థులకు 500 మార్కులు పైన వచ్చాయి. ఆ స్థాయిలో మార్కులు రావాలంటే 'హ్యాండ్‌రైటింగ్' ఖచ్చితంగా ఉండాలని తల్లిదండ్రుల్లో నమ్మకం కుదిరింది. చేతిరాతే కాదు కుడినుంచి ఎడమకు, ఎడమ నుంచి కుడికి, కింద నుంచి పైకి, పైనుంచి కిందకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ముత్యాల్లాంటి అక్షరాలు నేర్పించడంలో సక్సెస్ అయ్యాను. అనేక రికార్డులను సొంతం చేసుకున్నాను. మా పిల్లలే నా 'సంకల్పానికి' ఊతమిచ్చి భాగస్వామ్యం అయ్యారు. గిన్నీస్‌బుక్, వండర్‌బుక్, లిమ్కాబుక్ ఆఫ్ రికార్డు వంటి అనేక రికార్డులను మా అమ్మాయి అశ్వనీ కైవసం చేసుకుంది. మొత్తం 32 రికార్డులను సొంతం చేసుకుంది. చిన్నకొడుకు మంజునాథ్‌కు 13 రికార్డులు వచ్చాయి. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి 'చదువుల డాక్టర్'గా పేరు గడించడం ఎంతో గర్వంగా ఉంది. 2014లో అన్నారావు సర్కిల్







సమీపంలో 'భాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చి సెంటర్'ను ప్రారంభించాను. వీరికి చదువు రాదు, బాగా రాయడం రాదు 'మొద్దు' అని ముద్ర వేసిన వారిలో ప్రతిభను వెలికి తీయడమే మా పని. 2009లో రూపొందించిన 'ప్యాటర్న్'కు పేటెంట్ హక్కు 2023, ఏప్రిల్ 13న వచ్చింది. ఇటీవలే న్యూ బాలాజీ కాలనీలో ఎంఎంబిసి రెండో బ్రాంచి ప్రారంభించాను. వేసవి సెలవుల్లోనూ, ఆదివారాలపుడు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. మెటీరియల్స్, మై ఎఐ టీచర్ యాప్‌ను ఉచితంగా అందిస్తున్నాను. 'అందమైన చేతిరాతతో అందమైన భవిష్యత్' తీర్చిదిద్దాలన్న నా సంకల్పం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ అందించాలన్నది ప్రస్తుత నా లక్ష్యం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ నా శిక్షణను కొనసాగిస్తాను.

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ పాఠశాలల్లోనూ...

విషయమై ప్రభుత్వ టీచర్లకు మూడు దఫాలుగా ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించామన్నారు. గత విద్యా సంవత్సరం జగనన్న విద్యా కానుక కింద 1-10 తరగతిపిల్లలకు నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్, బ్యాగు, మూడు జతల ఏకరూప దుస్తులు ఇచ్చినట్లు చెప్పారు. ఈ ఏడాదీ వారికి సకాలంలో అందించినట్లు తెలిపారు. యూనిఫాం కుట్టుకూలి కింద 1-8వ తరగతి పిల్లలకు జతకు రూ40 రూపాయలు చొప్పున, 9-10 తరగతి పిల్లలకు జతకు రూ.80 రూపాయల చొప్పున ఇస్తున్నట్లు చెప్పారు. ఇటీవల వచ్చిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తిరుపతి జిల్లా ఎనిమిదో స్థానంలో నిలిచిందని, వచ్చే ఏడాది టెన్త్ ఫలితాల్లో మొదటి, రెండు స్థానాల్లో ఉండేలా లక్ష్యం పెట్టుకుని ఈ విద్యా సంవత్సరాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఈ మేరకు టీచర్లకు తర్ఫీదు ఇచ్చినట్లు తెలిపారు. ఆ విధంగా కార్యాచరణను రూపొందించినట్లు తెలిపారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న విద్యాకానుక పథకాలన్నీ ప్రభుత్వ బడుల్లో పనిచేసే పిల్లలకు అందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆణిముత్యం పథకం కింద దాదాపు 70శాతం మంది పిల్లలను చేర్చి తర్ఫీదు ఇస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులతో విద్యా కమిటీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కరువు ప్రాంతాల కల్పతరువు

విద్యార్థులకు రాగిజావ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

